



# మన దునియా

Our News Our World

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం... 9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 279 | జూన్ 6 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# వైబ్రాంట్ జూనియర్ కాలేజీ పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్త..!




- డీఐఈఓకు తెలియని వైబ్రాంట్ బ్రాంచీలు..?
- అనుమతి ఒక చోట... అడ్మిషన్లు అనేక చోట్లా..?
- సీటు రిజర్వేషన్ పేరుతో లక్షల రూపాయల వసూళ్లా..?
- రాష్ట్ర స్థాయి అధికారులు రంగంలోకి దిగాల్సిందేనంటున్న విద్యార్థి సంఘాలు..!

**మన దునియా, హనుమకొండ:జూన్ 05**

విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నారనే ఆరోపణల మధ్య హనుమకొండలో వైబ్రాంట్ జూనియర్ కాలేజీ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. “రాజస్థాన్ కోటా మోడల్”, “జేఈఈ-నీట్ టాప్ ఫలితాలు”, “దేశంలోనే అత్యుత్తమ ఫ్యాకల్టీ” అంటూ ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షిస్తున్న వైబ్రాంట్ యాజమాన్యంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అనుమతులు ఒకచోట... నిర్వహణ అనేక చోట్లా..?**

బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఒకే ప్రాంగణానికి అనుమతి తీసుకుని, వైబ్రాంట్ అకాడమీ పేరుతో నగరంలో పలు కేంద్రాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల అడ్మిషన్ల కోసం ప్రత్యేక ఏజెంట్లను నియమించి, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం.

డీఐఈఓ సమాధానాలపై సందేహాలు..!

వైబ్రాంట్ జూనియర్ కాలేజీ ఎక్కడ నిర్వహిస్తున్నారు..? ఎన్ని బ్రాంచీలు ఉన్నాయి..? అనుమతులు ఎక్కడికి ఉన్నాయి..? అనే ప్రశ్నలకు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు రావడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **“మన దునియా”** ప్రతినిధి అడిగిన ప్రశ్నలకు డీఐఈఓ ఇచ్చిన సమాధానాలు కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

**ప్రైవేట్ పాఠశాల విద్యార్థులే టార్గెట్..?**

పదో తరగతి పూర్తి చేసిన

(మిగతా 2వ పేజీలో..)

## ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు కొల్లగొట్టారు: సీఎం రేవంత్ రెడ్డి..

**మన దునియా,మహబూబ్‌నగర్: జూన్ 05**

మహబూబ్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమీషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇవాళ (శుక్రవారం) సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ ఎంపీగా కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని, కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును ఆయన పట్టించుకోలేదని మండిపడ్డారు. పాలమూరు

(మిగతా 2వ పేజీలో..)




## భవిష్యత్తులో వర్షాలు వచ్చే పరిస్థితి లేదు.. నీటిని ఆదా చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్

**మన దునియా,హైదరాబాద్,జూన్ 05**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కార్యక్రమాలు (మిగతా 2వ పేజీలో..)



## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

- పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె
- రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ
- చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు
- ఎన్జీవో ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా (మిగతా 2వ పేజీలో..)

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు: సీఎం డీకే శివకుమార్

- కర్ణాటకలో కొత్త ప్రభుత్వంలో మొదలైన విభేదాలు
- మంత్రి పదవికి రాజీనామా చేసిన సీనియర్ నేత రామలింగారెడ్డి
- బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- ఇది అధిష్ఠానం నిర్ణయమని స్పష్టం చేసిన సీఎం డీకే శివకుమార్
- రామలింగారెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడి

కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వంలో అప్పుడే అసమ్మతి సెగలు మొదలయ్యాయి. తాను ఆశించిన బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కలేదన్న అసంతృప్తితో సీనియర్ మంత్రి ఆర్. రామలింగారెడ్డి (మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## భవిష్యత్తులో వర్షాలు వచ్చే పరిస్థితి లేదు.. నీటిని ఆదా చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్

జరుగుతున్నాయన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కను నాటాలని కోరారు. ! ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈవీ వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో చెట్లు నాటుకోవాలని కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు..

## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు కొల్లగొట్టారు: సీఎం రేవంత్ రెడ్డి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తి చేస్తారని ఆశించామని, కానీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఆయన చేసిందేమీ లేదని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులకు కనీసం భూసేకరణ చేయకుండా ఎక్కడికక్కడే వదిలేశారని.. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇవ్వకుండా రిజర్వాయర్లలో నీరు నింపగలమా? అంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తామని, ప్రతిపక్షాలు అడ్డుకునేలా వ్యవహరించొద్దని సీఎం రేవంత్ హితవుపలికారు..

# మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు: సీఎం డీకే శివకుమార్

(మొదటి పేజీ తరువాయి)

తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే, శాఖల కేటాయింపు తన చేతుల్లో లేదని, అది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిధిలోని అంశమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్‌కు ఈ పరిణామం తొలి సవాల్‌గా మారింది. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రామలింగారెడ్డి, తనకు కేటాయించిన జలవనరుల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం రాజీనామా చేశారు. గతంలో తనకు బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించారని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై స్పందించిన సీఎం డీకే శివకుమార్, రామలింగారెడ్డికి హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. "నేను నా వంతు ప్రయత్నం చేశాను, కానీ తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంది. ఆయన నా మిత్రుడు, స్వయంగా వెళ్లి ఆయనతో మాట్లాడతాను" అని శివకుమార్ తెలిపారు.మరోవైపు, రామలింగారెడ్డి తన రాజీనామా లేఖపై బహిరంగంగానే సంతకం చేశారు. తనకు పదేపదే అవమానం జరుగుతోందని, ఆత్మసాక్షికి విరుద్ధంగా పనిచేయలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను పార్టీలోనే కొనసాగుతానని, కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోందని, ఒకవేళ ఆయన మెత్తబడకపోతే రాజీనామాను ఆమోదించే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్టీ అగ్రనేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

# వైబ్రాంట్ జూనియర్ కాలేజీ పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్త..!

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వైబ్రాంట్ ప్రతినిధులు పాఠశాలల చుట్టూ తిరుగుతూ అడ్మిషన్ల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీటు రిజర్వేషన్ పేరుతో ముందస్తు ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యా వ్యాపారమా...?**

జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో భారీ ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును వ్యాపారంగా మార్చుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "కోటా తరహా శిక్షణ", "టాప్ ర్యాంకులు" వంటి ప్రకటనలతో తల్లిదండ్రులను ఆకర్షించి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**గత ఫిర్యాదులకు ఫలితం శూన్యం..!**

గతంలో కూడా కళాశాల వ్యవహారంపై విద్యార్థి సంఘాలు ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. దీంతో అధికారుల తీరుపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

**వైబ్రాంట్‌పై అధికారుల ప్రేమ ఎందుకు..?**

ఇంతటి ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు కళాశాలపై సమగ్ర విచారణ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విద్యార్థి సంఘాల నాయకులు "వైబ్రాంట్ యాజమాన్యానికి అధికారులు కొమ్ముకాస్తున్నారా..?" అని ప్రశ్నిస్తున్నారు.

**రాష్ట్ర స్థాయి విచారణ అవసరమే..!**

జిల్లా స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు రంగంలోకి దిగి అనుమతులు, బ్రాంచీల నిర్వహణ, ఫీజుల వసూళ్లు, అడ్మిషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**వేచి చూడాలి...**

వైబ్రాంట్ జూనియర్ కాలేజీపై వస్తున్న ఆరోపణలపై రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా..? లేక ఈ వివాదం కూడా కాలగర్భంలో కలిసిపోతుందా..? అన్నది ఇప్పుడు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ । శనివారం । 6 । 2026



# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

**మరో ఇద్దరు గాంధీ ఆసుపత్రికి తరలింపు**

**మన దునియా,హైదరాబాద్,మే 05**





హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. అనుమానిత ఎబోలా లక్షణాలతో మరో ఇద్దరు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరారు. దీంతో ఇప్పటివరకు ఈ వైరస్ లక్షణాలతో గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు చేరిన వారి సంఖ్య ముగ్గురికి చేరింది. ఈ రోజు తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు ఎబోలా లక్షణాలతో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి వెళ్లారు. వారిని పరిశీలించిన వైద్యులు ప్రాథమిక లక్షణాల ఆధారంగా ఎబోలాగా అనుమానించారు. బాధితులను తక్షణమే మెరుగైన చికిత్స, ప్రత్యేక నిఘా కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, నిన్ననే మరో వ్యక్తిని కూడా ఇలాంటి లక్షణాలతోనే గాంధీ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో ఒక కీలక విషయం వెలుగుచూసింది. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు అనుమానితులు కూడా విదేశాల నుంచి ఒకే ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ముగ్గురు బాధితులు ఒకే విమానంలో ప్రయాణించారనే విషయం తేలడంతో వైద్య నిపుణులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. సదరు ఫ్లైట్‌లో ప్రయాణించిన మిగతా ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారిలో ఎవరికైనా ఇలాంటి లక్షణాలు ఉన్నాయా అనే కోణంలో ట్రాక్ చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చేరిన ముగ్గురికీ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరి రక్త నమూనాలను సేకరించి, తుది నిర్ధారణ కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ం) కి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపాయి..

# కాటేదాన్ టు శంషాబాద్ రోడ్..మైలార్‌దేవ్‌పల్లి మీదుగా ఆరు లేన్ల వంతెన

**రూ.189.68 కోట్లతో నిర్మాణం**

**విమానాశ్రయానికి రాకపోకలు సులువు**

**మన దునియా,హైదరాబాద్:జూన్ 05**



హైదరాబాద్ మహానగరంలో మరో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్, కాటేదాన్ జంక్షన్ల మీదుగా రూ.189.68 కోట్లతో ఆరు లేన్ల బై డైరెక్షనల్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలుపుతూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటీవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీలో)లో భాగంగా నగరంలోని ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఇతర జాతీయ రహదారులపైకి చిక్కులు లేని ప్రయాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే హెచ్-సిటీలో కేబీఆర్ పార్కు జంక్షన్, ఫాక్స్ సాగర్ బ్రిడ్జి, గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం మొదలైంది. పంజాగుట్ట ఎన్ఎ?ఫసీఎల్ జంక్షన్, అల్వీన్ కాలనీ, రసూల్‌పుర జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఏజెన్సీలు ఎంపిక చేశారు.

4.71 శాతం ఎక్కువకు..

కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో కాలగమనంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, లోకల్ ట్రాఫిక్‌తోపాటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే వాహనాలతో ఇక్కడి రోడ్లు జామ్‌జాటంగా మారుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా రూ.189.68 కోట్లతో మూడు జంక్షన్‌ల వద్ద సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం వంతెన నిర్మాణం ప్రతిపాదించారు. టెండర్‌లో కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ ఎంపికకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంస్థలు బిడ్‌లు దాఖలు చేయగా.. రెండూ ప్రతిపాదిత అంచనా వ్యయం కంటే ఎక్కువ కోట్ చేశాయి. కేఎన్‌ఆర్ 189.68 కోట్లు (4.71 శాతం ఎక్సెస్), ఎన్‌సీసీ లిమిటెడ్ రూ.189.88 కోట్లు (4.82 శాతం) కోట్ చేశాయి.సాంకేతిక, ప్రైస్ బిడ్‌ను పరిశీలించిన అధికారులు. వివరాలను జీహెచ్‌ఎంసీ పురపాలక శాఖకు పంపగా ఎల్-1 బిడ్డర్‌గా ఉన్న కేఎన్‌ఆర్ సంస్థ ఎంపికకు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుకు హెచ్-సిటీ నిధులను వెచ్చించాలని, ఎంపికైన సంస్థతో అగ్రిమెంట్ చేసి.. పనులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వంతెన పూర్తయితే ఫలక్‌నుమా, బహదూర్‌పురా, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, సంతోష్ నగర్, మిధాని, మందమల్లమ్మ, సైదాబాద్, ఐఎస్ సదన్ తదితర ప్రాంతాల నుంచి వినామాశ్రయానికి రాకపోకలు సులువు కానున్నాయి..

# హిందూ సేన పూజ్య శ్రీ రాధా మనోహర్ దాస్ స్వామీజీ





**మన దునియా. హనుమకొండ:**

5 -6- 26 శుక్రవారం రోజున ఉదయం 11:30 గంటలకు అభయ హిందూ సేన పూజ్య శ్రీ రాధా మనోహర్ దాస్ స్వామీజీ గారు శ్రీ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది అలాగే 28 6 26 ఆదివారం రోజున కాళోజి కళాక్షేత్రం నందు ద్వి తీయ వార్షికోత్సవం జరుపబడును తెలుపుతూ అనుగ్రహ భాష సందేశం ఇవ్వనైనది ఇట్టి కార్యక్రమంలో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ నాగిల్ల శంకర్ శర్మ గారు వేద పండితులు నాగిళ్ల పద్మనాభషన్ముఖ అవధాని గారు ఆలయ విశిష్టతను తెలియజేసినారు మనోహర్ దాస్ స్వామీజీ గారు మాట్లాడుతూ నిర్భయయులైన హిందువుల ఐక్యతే భారతదేశానికి హైందవ ధర్మానికి శ్రీరామరక్ష సనాతన ధర్మమును ప్రచారం చేసే వారిని మరియు రక్షించుటకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను సాధు పుంగవలను ప్రచార సంస్థలను ఆదరించవలెనని తెలియజేసినారు శారీరక ఆరోగ్యానికి మానసిక ఉన్నతికి ఆధ్యాత్మికతకు అభ్యున్నతికి శ్రీ ఏకాదశి వ్రతం పాటించండి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కనుకుంట్ల రవికుమార్ పొలు లక్ష్మణ్ తుమ్మేటి విక్రమ్ బుచ్చిరాజు సదానందం భక్తులు పాల్గొన్నారు



# మిర్యాలగూడలో పెను విషాదం.. సిలిండర్ పేలి ముగ్గురి మృతి




**మన దునియా,నల్గొండ,జూన్ 05**

మిర్యాలగూడలో పెను విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు కుటుంబసభ్యులు సజీవ దహనం అయ్యారు. అమ్మమ్మ, మనవడు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యాభర్తలు. సైదులు అనారోగ్యం కారణంగా నెలరోజుల క్రితం చనిపోయాడు. చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ధనమ్మ తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్(16), ప్రణతి(14)తో పుట్టింట్లోనే ఉంటోంది.మూడు రోజుల క్రితం ఇళ్లలో పని చేసేందుకు పుణె వెళ్లింది. గురువారం రాత్రి చంద్రకళ.. మనవడు, మనవరాలితో ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ముగ్గురూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయకచర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు మూడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు..

# ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**మన దునియా, జూన్05,మంచిర్యాల**



మందమర్రి మండలంలోని సండ్రపల్లి గ్రామంలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై మందమర్రి ఎస్సై జి. నరేష్ కేసు నమోదు చేశారు. ?ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సండ్రపల్లి గ్రామానికి చెందిన ఏదుల లస్మక్క తన ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా, తన కుమారుడు ఏదుల రాజ్ కుమార్ (28) మద్యానికి బానిసయ్యాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజ్ కుమార్, తన మద్యపాన అలవాటు వల్ల కుటుంబంలో తలెత్తిన సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే నిన్న రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసి బయటకు వెళ్లిన రాజ్ కుమార్, తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి రోజు ఉదయం (జూన్ 5) 7:30 గంటల సమయంలో, రాజ్ కుమార్ గ్రామంలోని ఒక వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందిందని సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, క్రైమ్ నంబర్ 124/26, సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జి. నరేష్ తెలిపారు.

# ఘాట్ రోడ్డులో మినీబస్సు బోల్తా.. 17 మందికి గాయాలు

**మన దునియా,పోలవరం జిల్లా చింతూరు,మారేడుమిల్లి ఘాట్: జూన్ 05**

చింతూరు: పోలవరం జిల్లా చింతూరు--మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన టెంపో మినీబస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనలో 17 మంది గాయపడగా, వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు.గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఘాట్ రోడ్డులో వాహనం అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది...



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# పచ్చని చెట్టు, ప్రగతికి మెట్టు

**ప్రతి ఇంటికి ఒక మొక్క, భవిష్యత్తు ఆరోగ్యానికి పునాది**

**భార్య భర్తల ప్రేమానురాగాలు నేడు పచ్చని చెట్టుకు జీవనం**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవ , వేల, భీంపల్లి వృద్ధ,దంపతులు, ఎంతో ఆదర్శం,**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**



ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, భూతాపం, అడవుల నరికివేత వంటి పర్యావరణ సమస్యలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉంది. "పచ్చని చెట్టు -- ప్రగతికి మెట్టు" అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి ప్రతి ఇంటిలో కనీసం ఒక మొక్కను నాటాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.చెట్లు మానవ జీవనానికి అత్యంత అవసరమైన ప్రాణవాయువును అందిస్తాయి. గాల్లోని కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేయడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయి. చెట్ల పెంపకం వల్ల వర్షపాతం మెరుగుపడి భూగర్భ జలాలు పెరగడంతో పాటు నేల సారం కూడా కాపాడబడుతుంది.అంతేకాకుండా చెట్లు పక్షులు, జంతువులకు ఆశ్రయంగా నిలుస్తూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెరగడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది. వేప, తులసి, ఉసిరి వంటి ఔషధ మొక్కలు ఆరోగ్య పరిరక్షణకు కూడా ఉపయోగపడతాయి.పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న హరితహారం వంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు వంటి ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటును పెంపొందించుకోవాలని పిలుపునిస్తున్నారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చని ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

# 500 మంది పోలీసుల మెరుపు దాడి..

## ఉలిక్కిపడ్డ స్పా సెంటర్ల నిర్వాహకులు

**మన దునియా హైదరాబాద్:జూన్ 05**




నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు.స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు.ఈ సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం అనే చర్చ నడుస్తుంది. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు..

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ:జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

**ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు ప్రజావాణి**

**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా:జూన్ 05**



గద్వాల:–జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి రోజు ( వర్కింగ్ డేస్ లో ) మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, న్యాయపరమైన సమస్యలు, ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# నూతన జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారికి సీఐటీయూ అభినందనలు





**మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి**

**మన దునియా మంచిర్యాల జూన్; 05.**

మంచిర్యాల జిల్లా నూతన జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) నాయకులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచడంతో పాటు కోడిగుడ్లు, గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు.యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండి రఫియా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని ఒత్తిడి తీసుకురాగా, అందుకు అవసరమైన నిధులను విడుదల చేయలేదన్నారు. దీంతో కార్మికులు స్వంతంగా ఖర్చు పెట్టి అల్పాహారం అందించాల్సి వచ్చిందని, ఒక్కో కార్మికుడు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపోయారని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం గత పరిస్థితులు పునరావృతం కాకుండా ముందుగానే మెనూ చార్జీలను పెంచాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, యూనిఫాంలు అందించాలని, అలాగే బీమా సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కరీమా, మధుణమ్మ, సరిత, బుచ్చమ్మ, రబియా తదితర కార్మికులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు







**"సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి -- పర్యావరణాన్ని కాపాడండి."**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా జూన్; 05.**

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఇందన్‌పల్లి గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ మరియు ప్రకృతి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టారు.అనంతరం ఇందన్‌పల్లి రేంజ్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి, అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే దుష్ప్రభావాలను వివరించారు.ప్లాస్టిక్ కారణంగా నేల, నీరు, గాలి కాలుష్యం పెరుగుతుందని, ప్లాస్టిక్ పూర్తిగా కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని తెలిపారు. పశువులు, అడవి జంతువులు, పక్షులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తిని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోయి వరదలకు కారణమవుతాయని, నదులు, చెరువులు, సముద్ర జీవవ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు.ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల విషపూరిత వాయువులు విడుదలై మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు ఆహారం, తాగునీటి ద్వారా మన శరీరంలోకి చేరి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని జీవ వైవిధ్యం తగ్గిపోతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ ఇందన్‌పల్లి మాట్లాడుతూ, రానున్న వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేసి పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిపారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా మంచి సందేశాన్ని సమాజానికి అందించినవారమవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.

# మా పాలమూరు ముద్దుబిడ్డ "రేవంతన్న"

**సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సీఎం దృష్టికి..**

**జడ్చర్ల సభకు ప్లకార్డులతో భారీగా తరలిన కొత్తూరు మండల ప్రజలు**

**మన దునియా,కొత్తూరు/జడ్చర్ల: జూన్ 05**

కొత్తూరు/జడ్చర్ల: కొత్తూరు మండలం సిద్దాపూర్ వద్ద ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొత్తూరు మండల ప్రజలు నాయకులు, గ్రామస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లారం శేఖర్ రెడ్డి.. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక జేఏసీ అధ్యక్షులు అంబటి ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జడ్చర్లలో జరుగుతున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్లకార్డులతో తరలివెళ్లారు.సిద్దాపూర్ వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సభ ప్రాంగణంలో నిరసన సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శనకు తరలి వెళ్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రికి స్వయంగా వినతిపత్రం అందజేసి గ్రామస్తుల అభ్యంతరాలను వివరించనున్నట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి ఎట్టి పరిస్థితుల్లోనూ సిద్దాపూర్ వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు కోరారు..



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

జూన్ | శనివారం | 6 | 2026



# భీంపల్లిలో స్వచ్ఛంద శ్రమదానం









**పరిశుభ్ర గ్రామం కోసం గ్రామస్థుల సమిష్టి కృషి**

**మన దునియా ప్రతినిధి, కమలాపూర్**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం "మన ఊరి భీంపల్లి" కార్యక్రమంలో భాగంగా భారీ స్థాయిలో స్వచ్ఛంద శ్రమదానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ మునిరాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఉదయం 6 గంటల నుంచే గ్రామస్థులు వీధుల్లోకి వచ్చి శ్రమదానంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కూడళ్లు, ప్రజా ప్రదేశాలను శుభ్రపరిచారు. రోడ్ల పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను సేకరించి పారవేశారు.అలాగే మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, దేవాలయ ప్రాంగణాలను సైతం శుభ్రపరిచారు.ఈ సందర్భంగా సర్పంచ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ యంత్రాంగంపై ఆధారపడకుండా ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా ఇలాంటి పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించి భీంపల్లిని జిల్లాలోనే అత్యంత పరిశుభ్రమైన గ్రామంగా నిలపాలని తెలిపారు.శ్రమదానంలో యువత ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రత పనులు చేపట్టగా, మహిళలు ఇంటి పరిసరాల పరిశుభ్రత, చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని గ్రామస్థులకు సూచించారు.గ్రామ ప్రజల సమిష్టి కృషితో కొద్ది గంటల్లోనే గ్రామ వాతావరణం పరిశుభ్రంగా మారింది. భీంపల్లి ప్రజలు ప్రదర్శించిన ఐక్యత, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న చైతన్యం చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభినందించారు.

# రిజిస్ట్రేషన్ విలువల పెంపుతో రైతులు, మధ్యతరగతిపై భారం





**షాద్ నగర్ బీజేపీ నేతల ఆగ్రహం**

**మన దునియా,షాద్ నగర్:జాన్ 05**

తెలంగాణ ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ వెల్యుయేషన్ ధరలను భారీగా పెంచడంతో రైతులు, మధ్యతరగతి ప్రజలు, భూమి కొనుగోలుదారులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని షాద్‌నగర్ బీజేపీ ఇంచార్జ్ అందె బాబయ్య, రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కక్కునూరి వెంకటేష్ గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ వెల్యుయేషన్ విధానంతో భూముల విలువలు సుమారు 50 నుంచి 60 శాతం వరకు పెరిగాయని వారు పేర్కొన్నారు. ఫరూక్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారిని కలుసుకొని పెరిగిన చార్జీల ధరలను కనుక్కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ పరిధిలోని షాద్‌నగర్ ప్రాంతంలో భూమి కొనుగోలు చేయాలంటే ఎకరానికి కనీసం రూ.10 లక్షల రిజిస్ట్రేషన్ విలువ నిర్ణయించగా, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) సమీప ప్రాంతాల్లో ఎకరానికి రూ.15.50 లక్షల వరకు వెల్యుయేషన్ నిర్ణయించడం రైతులు, చిన్న పెట్టుబడిదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడం కోసం ప్రజలపై అదనపు భారం మోపడం సమంజసం కాదని వారు అన్నారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన అందె బాబన్న, వెంకటేష్ గుప్తా అక్కడి అధికారులతో సమావేశమై పెరిగిన రిజిస్ట్రేషన్ విలువలు, అమలు విధానంపై వివరాలు సేకరించారు. రిజిస్ట్రేషన్ విలువల పెంపు కారణంగా భూముల కొనుగోలు, అమ్మకాలు మందగించే ప్రమాదం ఉందని, సాధారణ ప్రజలకు ఇల్లు లేదా స్థలం కొనుగోలు చేయడం మరింత భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పెంచిన రిజిస్ట్రేషన్ వెల్యుయేషన్ చార్జీలను వెంటనే తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

## జడ్చర్ల సీఎం సభకు కేశంపేట నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**మన దునియా,కేశంపేట,జడ్చర్ల: జాన్ 05**



కేశంపేట: జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కేశంపేట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పీటీసీ తంద్ర విశాల శ్రావణ్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో సభకు బయలుదేరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు సంఘీభావం వ్యక్తం చేశారు. సభకు వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువత మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## నకిలీ పత్తి విత్తనాల రవాణా నిందితుల అరెస్ట్,

**స్విఫ్ట్ డిజైర్ కార్ నకిలీ విత్తనాలు స్వాధీనం**

**మన దునియా, జూన్ 05, మంచిర్యాల**




మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్స రమేష్ ప్రత్యేక పర్యవేక్షణ ఆదేశాల మేరకు, నకిలీ విత్తనాల విక్రయదారులపై మందమర్రి పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా మెరుపు దాడి నిర్వహించి నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు చేశారు. అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ఇద్దరు నేరస్థులను పట్టుకుని, వారి నుండి సుమారు 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు.మందమర్రి పరిధిలోని రామన్ కాలనీ బ్రిడ్జ్ సమీపంలో నకిలీ విత్తనాల రవాణా జరుగుతోందనే నమ్మదగిన సమాచారంతో, మందమర్రి పోలీసులు వ్యవసాయ అధికారి (ఏ ఈ వో) కలిసి సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా వచ్చిన ఒక స్విఫ్ట్ డిజైర్ కారు (నెంబర్: టి ఎస్ 19 ఎచ్ 5554) ను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి రశీదులు, పర్మిట్లు లేని సుమారు 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి.నిందితులు సులభంగా ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో, బైంసాకు చెందిన అబ్దుల్ రజాక్ వద్ద కిలో రూ. 1000/- చొప్పున ఈ నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేశారు. వాటిని మందమర్రి ప్రాంతానికి తీసుకువచ్చి, ఇక్కడి చుట్టుపక్కల గ్రామాల్లోని అమాయక రైతులకు ఒక్కో కిలో రూ. 2500/- చొప్పున విక్రయించి భారీగా లాభాలు గడపాలని ప్లాన్ చేశారు. రైతులకు నమ్మకం కలిగించేందుకు బ్రాండెడ్ కంపెనీల నకిలీ సంచులను వాడుతూ మోసానికి పాల్పడుతున్నారు.ఈ నేరస్తులను పట్టుకోవడంలో చొరవ చూపిన మందమర్రి ఎస్సై జి. నరేష్ , కానిస్టేబుల్ రాకేష్, చైతన్య లను మందమర్రి సిఐ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మందమర్రి సిఐ మాట్లాడుతూ, వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని హెచ్చరించారు. విత్తనాలు కొనేటప్పుడు కేవలం గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదులు (బిల్లులు) తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు గానీ, వ్యవసాయ శాఖ అధికారులకు గానీ సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.నిందితులపై చట్టప్రకారం కఠినమైన కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**కేకేఓసీలో మొక్కలు నాటిన అటవీ శాఖ అధికారులు**

**మన దునియా, జూన్ 05,మంచిర్యాల**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేకేఓసీ ఆవరణలో భారీ మొక్కల పెంపకం (ప్లాంటేషన్) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపొందించడమే లక్ష్యంగా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, హాజరై మొదటి మొక్కను నాటి ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ రావు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల పాత్ర కీలకమైనదని, ఇలాంటి ప్లాంటేషన్ కార్యక్రమాల ద్వారా అటవీ శాతాన్ని మరింత పెంచవచ్చని పేర్కొన్నారు.?అదేవిధంగా మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్ మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున కేకేఓసీ ప్రాజెక్ట్ పరిధిలో ఈ రకమైన సామూహిక వనమహోత్సవం చేపట్టడం అభినందనీయమని, సిబ్బంది స్థానికులు పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, కేకేఓసీ ప్రాజెక్ట్ ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల నీడను ఇచ్చే, పండ్ల మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడతామని ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## ప్రపంచ పర్యావరణ ,దినోత్సవం సందర్భంగా, ప్రత్యేక గ్రామసభ, ఏర్పాటుచేసిన, గుమ్మడిదొడ్డి సర్పంచ్, నా గ్రామం ,నా బాధ్యత అంటున్న ,భరత్ కుమార్






**మన దునియా, వాజేడు ,జూన్ 5**

99 రోజుల ప్రజా ప్రగతి ప్రణాళిక భాగంగా ఈరోజు సర్పంచ్ బోధె బోయినభరత్ కుమార్ ఆధ్వర్యంలో మరియు సెక్రెటరీ స్వప్న మరియు పాలక సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ బోధె బోయిన భరత్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నీటి సంరక్షణ అనేది మంచినీటిని వృధా చేయకుండా భవిష్యత్ తరాల కోసం పరిరక్షించడం ఇంట్లో నీటిని ఆదా చేయాలి ట్యాప్ నీటిని విడిచిపెట్టకుండా చూడాలి ఇంకుడు గుంతలు పెంచుకోవాలి మరియు నీటి వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవడం ద్వారా నీటి కొరత నివారించవచ్చు ఆయన అన్నారు నీటిని సంరక్షించడానికి ఇక్కడ కొన్ని సులువమైన మార్గాలు ఉన్నాయి ఇంట్లో నీటిని ఆదా చేసుకోవాలి ట్యాప్ రోడ్ల పైన ఎక్కడైనా వేస్ట్ గా వాటర్ పోయినట్లయితే మన విధిగా ఆ టాప్ కట్టేయండి లీక అయ్యే నల్లాలను నా దృష్టికి తీసుకు రాగలరని మరియు పైపులను వెంటనే బాగు చేయగలను నీటి సంరక్షణ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భు గర్భ జలాలు పెరుగుతాయి దీనిపై అవగాహన పెంచాలి అని ఆయన అన్నారు

## వికారాబాద్ కోర్టులో పర్యావరణ దినోత్సవం మొక్కలు నాటిన న్యాయమూర్తులు, ఎస్పీ

**మన దునియా,వికారాబాద్ జిల్లా:జూన్ 05**



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, ఎస్పీ స్నేహ మెహ్రా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత అని న్యాయమూర్తి నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శాంతి లత, అదనపు జూనియర్ న్యాయమూర్తి వైష్ణవి, అటవీశాఖ అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు లవకుమార్, వసుందర, వెంకట్ రెడ్డి, చీఫ్ న్యాయవాది టి. వెంకటేష్, న్యాయవాదులు రాము, కమల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నాగరాజు, రాజు, రాజశేఖర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో నకిలీ వైద్యుడి క్లినిక్‌పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ దాడి

**మన దునియా హనుమకొండ జిల్లా, జూన్ 05**

హనుమకొండ జిల్లా యేనుగులగడ్డ ఇంద్రానగర్‌లో నకిలీ వైద్యుడి క్లినిక్‌పై డీసీఏ అధికారుల దాడి.బత్తుల రాజు కుమార్ అనే వ్యక్తి సరైన అర్హతలు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తింపు. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు. మొత్తం 41 రకాల మందులు, అందులో 35 రకాల ఇన్‌స్టిట్యూషనల్ సప్లై మందులు గుర్తింపు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, బీపీ మందులు స్వాధీనం.స్వాధీనం చేసుకున్న మందుల విలువ సుమారు రూ.10,000. క్లినిక్‌లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్ల వినియోగం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని డీసీఏ హెచ్చరిక.మందుల నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపిన అధికారులు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ వెల్లడించింది. లైసెన్స్ లేని వ్యక్తులు,క్వాక్‌లకు మందులు సరఫరా చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక.....



## శాత్రాజుపల్లి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

**కలెక్టర్, మైనింగ్ అధికారికి గ్రామస్థుల ఫిర్యాదు**

**మన దునియా,వేములవాడ:జూన్ 05**



వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ చెరువులో అనుమతికి మించి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు, రైతులు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా మైనింగ్ అధికారికి శు క్రవారం ఫిర్యాదు చేసి వెంటనే మట్టి తరలింపును నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శాత్రాజుపల్లి గ్రామ చెరువు నుంచి 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తరలించేందుకు జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్లు కావటి గంగధర్, బొడ్డుపెల్లి జగన్రాజుకు అనుమతి మంజూరైందని, అయితే గత ఐదు రోజులుగా మూడు పోక్లెయిన్లు, సుమారు 50 టిప్పర్ల సహాయంతో అనుమతికి మించి పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని చెరువు నుంచి తరలించారని, ఇంకా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో చెరువులోని నల్లమట్టి పూర్తిగా తొలగిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో గ్రామ ప్రజలు, రైతులకు అవసరమైన మట్టి అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులను ఉల్లంఘించి మట్టి తరలింపునకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి గ్రామ ప్రజల, రైతుల ప్రయోజనాలను కాపాడాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ ఉపసర్పంచ్ లు రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస్, గుడిసె అనిల్, శివ శ్రీనివాస్, మ్యాకల కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## సూర్యాపేటలో ఖాకీల అరాచకం.. వట్టే జానయ్య అక్రమ అరెస్టుతో భగ్గుమన్న టీఆర్పీ నేతలు.!

**జానయ్య యాదవ్ ఆరోగ్యానికి హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత...**

**బీసీ బిడ్డ ఎదుగుదలను చూసి ఓర్వలేకే కుట్రలు: టీఆర్పీ సోషల్ మీడియా నార్త్ తెలంగాణ కన్వీనర్ కాసోజు బ్రహ్మాచారి**

**మన దునియా,జనగామ జిల్లా: సూర్యాపేట జిల్లా: మజూన్ 05**



జనగామ జిల్లా: సూర్యాపేట జిల్లా కేంద్రంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు వ్యతిరేకంగా గళమెత్తిన టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని టీఆర్పీ సోషల్ మీడియా నార్త్ తెలంగాణ కన్వీనర్ కాసోజు బ్రహ్మాచారి నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికార పార్టీ అండదండలతో సాగుతున్న 'వజ్ర టౌన్‌షిప్' భూదందాలను, ఒక నేరచరితురాలి అక్రమాలను ప్రశ్నించినందుకు ఒక బడుగు బలహీన వర్గాల నేతను బలవంతంగా లాకెళ్లడం పోలీసుల దౌర్జన్యానికి పరాకాష్ట అని వారు మండిపడ్డారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు జానయ్య యాదవ్ శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, చట్టాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న జానయ్య యాదవ్ ఎదుగుదలను తట్టుకోలేక, ఆయనను ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీయడానికే ఈ దారుణమైన కుట్రకు తెరలేపారని తీవ్రస్థాయిలో ఆరోపించారు.రోజంతా ఎండలో నిరసన తెలపడం, పోలీసుల తోపులాట కారణంగా జానయ్య యాదవ్ బీపీ పూర్తిగా పడిపోయి సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్యానికి ఏమాత్రం హాని జరిగినా ప్రభుత్వం, స్థానిక పోలీసులే సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఖాకీలు అధికార పక్షానికి తొత్తులుగా మారడం మానుకోవాలని, తక్షణమే జానయ్య యాదవ్‌ను బేషరతుగా విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు..

## యాదాద్రి జిల్లా,ధర్మారం గ్రామ ముదిరాజ్ లపై పోలీసులు ఏకపక్షంగా ఎఫ్ ఐ ఆర్ చేయడం సరికాదు

**చేపల దొంగల లపై ఎఫ్ ఐ ఆర్ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటి?**

**మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్**

**మన దునియా యాదాద్రి భువనగిరి జిల్లా,అడ్డగూడూరు: జూన్ 05**



యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలం, ధర్మారం గ్రామ మత్స్యకార సహకార సంఘం పరిధిలోని చెరువుల్లో గత కొన్ని రోజులుగా చేపలను దొంగతనంగా పట్టుకుంటున్నారు.మంగళవారం నాడు అంటే జూన్ 2 నాడు గతంలో లాగానే చేపల దొంగతనానికి పాల్పడుతున్న దుండగులను ధర్మారం మత్స్యకారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది.దొంగలని అడ్డుకున్న మత్స్యకారులపైనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి, దొంగలపైన ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయకపోవడం అన్యాయమని! మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ దీన్ని తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనపై శు క్రవారం నాడు పులి దేవేందర్ ముదిరాజ్ స్పందిస్తూ... మత్స్యకారుల జీవనాధారమైన చెరువులను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, దొంగలపైన పిటిషన్ ఇచ్చిన స్థానిక ఎస్ ఐ స్పందించకుండా ఉండడం పోనీ,ఊరు అందరూ దొంగతనం చేశారు! అందరిపైన కేసు లు పెట్టాలా? అని అనడం విడ్డూరం అని, స్థానిక ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ దొంగలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. మత్స్యకారుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి చర్యలను ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. బాధితులైన మత్స్యకారులకు న్యాయం జరగకపోతే, రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జరుగుతున్నాయని ప్రభుత్వం ఇలాంటి వారిని శిక్షించడానికి ఒక కఠిన చట్టం తీసుకురావాలని మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) డిమాండ్ చేస్తుందని అన్నారు.

## పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# టీమిండియాలో విచిత్రం... కెప్టెన్ సహా ఆ ఏడుగురూ గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లే!



**ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టుకు ముందు భారత జట్టులో ఏడుగురు గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు**

**ఐపీఎల్ ఫైనల్ ఆడిన వారిని టెస్టుకు సిద్ధం చేయడమే సవాల్ అని చెప్పిన సహాయ కోచ్**

**పేసర్ మహ్మద్ సిరాజ్ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడని వెల్లడి**

**నెం.3 బ్యాటింగ్ స్థానంపై ఇప్పటికీ కొనసాగుతున్న అన్వేషణ**

**కుల్దీప్, సుందర్‌లతో పాటు మరో యువ స్పిన్నర్‌కు అవకాశం**

ఆఫ్ఘనిస్థాన్‌తో రేపటి (జూన్ 6) నుంచి మూలాన్‌పూర్‌లో జరగనున్న ఏకైక టెస్టుకు భారత జట్టు సిద్ధమవుతోంది. అయితే, ఐపీఎల్ 2026 ముగిసిన కేవలం ఐదు రోజులకే ఈ మ్యాచ్ ఆడుతుండటంతో ఆటగాళ్ల సన్నద్ధతపై మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా, ఐపీఎల్ ఫైనల్ ఆడిన గుజరాత్ టైటాన్స్ నుంచి కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సహా ఏడుగురు ఆటగాళ్లు ఈ జట్టులో ఉండటమే ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారిందని భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే అంగీకరించాడు. వారిని మానసికంగా, శారీరకంగా టెస్ట్ క్రికెట్‌కు సిద్ధం చేయడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని డస్కాటే స్పష్టం చేశాడు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన డస్కాటే, జట్టు సన్నద్ధత గురించి పలు విషయాలు పంచుకున్నాడు. పేసర్ మహ్మద్ సిరాజ్ నెట్స్ లో పూర్తి ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేశాడని, అతను అందుబాటులో ఉండటం జట్టుకు బలమని తెలిపారు. రవీంద్ర జడేజాకు విశ్రాంతినివ్వడంతో, స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లు ఆడటం ఖాయమని, మూడో స్పిన్నర్ స్థానానికి హర్ష్ దూబే లేదా మానవ్ సుతార్‌లలో ఒకరిని ఎంచుకుంటామని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. జట్టులో కీలకమైన నెం.3 బ్యాటింగ్ స్థానం ఇంకా అస్థిరంగానే ఉందని డెస్కాట్ ఒప్పుకున్నారు. అయితే, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన దేవదత్ పడిక్కల్, ఐపీఎల్‌లో మెరిసిన సాయి సుదర్శన్ వంటి ఆటగాళ్లపై నమ్మకం ఉందని చెప్పారు. డబ్ల్యూటీసీ పాయింట్ల దృష్ట్యా ఈ స్థానంలో స్థిరత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 ఫార్మాట్ నుంచి టెస్టులకు మారడం సవాలని, ఆటగాళ్ల నిద్ర సమయాలు, వైట్-బాల్ అలవాట్ల నుంచి బయటపడటం, టెక్నిక్‌లో మార్పులు చేసుకోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఈ సవాళ్లను అధిగమించడంలో భారత ఆటగాళ్లు చూపిస్తున్న వృత్తి నైపుణ్యాన్ని ఆయన ప్రశంసించారు.

టీమిండియాలో ఉన్న గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు వీరే...

1. శుభ్‌మన్ గిల్
2. సాయి సుదర్శన్
3. వాషింగ్టన్ సుందర్
4. మహమ్మద్ సిరాజ్
5. ప్రసిద్ధ్ కృష్ణ
6. మానవ్ సుతార్
7. గుర్నూర్ బ్రార్

# వెలుతురు తగ్గినా ఆగని టెస్టులు... పింక్ బాల్ ప్రయోగంపై గంభీర్ ఏమన్నాడంటే?

**టెస్టుల్లో బ్యాడ్ లైట్ సమస్యకు ఐసీసీ కొత్త పరిష్కారం**

**రెడ్ బాల్ స్థానంలో పింక్ బాల్ వాడకంపై ప్రయోగం**

**ఇది సానుకూల నిర్ణయమన్న టీమిండియా హెడ్ కోచ్ గంభీర్**

**వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ వంటి కీలక మ్యాచులకు మేలు**

**అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త నిబంధన ట్రయల్స్**

టెస్టు క్రికెట్‌లో వెలుతురు లేమి (బ్యాడ్ లైట్) కారణంగా ఓవర్లు నష్టపోకుండా ఉండేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చేపట్టిన నూతన ప్రయోగానికి భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు ప్రకటించాడు. మ్యాచ్ మధ్యలో రెడ్ బాల్ స్థానంలో పింక్ బాల్‌ను ఉపయోగించేందుకు అనుమతించడాన్ని గంభీర్ ఒక సానుకూల పరిణామంగా అభివర్ణించాడు. మ్యాచ్ ఫలితాలను రాబట్టేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని అతడు పేర్కొన్నాడు. న్యూచండీగఢ్ వేదికగా శనివారం నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు గంభీర్ మీడియాతో మాట్లాడాడు. "మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉన్నప్పుడు అటువంటి నిర్ణయాలకు పూర్తి మద్దతు ఇవ్వాలనేది నా అభిప్రాయం. ఉదాహరణకు, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలంటే మీరు ఆడే చివరి టెస్టులో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉందనుకోండి. ఒకవేళ వెలుతురు సరిగా లేకపోవడం వల్ల ఆ మ్యాచ్ డ్రాగా ముగిస్తే ఎంతటి నష్టం జరుగుతుందో ఆలోచించండి. అందుకే ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను" అని వివరించాడు. ఐసీసీ తాజాగా ఆమోదించిన ఈ ప్రయోగాత్మక నిబంధన ప్రకారం, టెస్టు మ్యాచ్‌లు యథావిధిగా సంప్రదాయ రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతాయి. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా వెలుతురు తగ్గే అవకాశం ఉందని భావిస్తే, ఇరు జట్ల కెప్టెన్లు ముందుగానే అంగీకరించిన మేరకు పింక్ బాల్‌ను ఉపయోగించవచ్చు. దీనివల్ల ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ ఆటను నిరంతరాయంగా కొనసాగించడం సాధ్యమవుతుంది. ఆట మధ్యలో వేరొక బంతికి మారడం ఆటగాళ్లకు కొంత సవాలుతో కూడుకున్న విషయమేనని గంభీర్ అంగీకరించాడు. "అయినప్పటికీ, రెండేళ్ల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఇది ఒక సానుకూల ముందడుగు. అన్ని జట్లు దీనిని సానుకూల దృక్పథంతో స్వీకరిస్తాయని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. ఈ నూతన నిబంధన అక్టోబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.





## ఐపీఎల్ 2026 ఫైనల్ తర్వాత... ట్రక్కు కిందకు దూసుకెళ్లిన కారు.. ప్రాణాలతో బయటపడ్డ ఆసీస్ మాజీ కెప్టెన్





**ఐపీఎల్ ఫైనల్ తర్వాత కారు ప్రమాదానికి గురైన మైఖేల్ క్లార్క్**

**ట్రక్కు కిందకు దూసుకెళ్లిన కారు.. స్వల్ప గాయాలతో బయటపడ్డ క్లార్క్**

**నిద్రలో ఉండగా ప్రమాదం జరిగిందని వెల్లడి**

**సహాయం చేసిన భారతీయులకు, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపిన క్లార్క్**

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత మైఖేల్ క్లార్క్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఐపీఎల్ 2026 ఫైనల్ ముగిసిన అనంతరం అహ్మదాబాద్‌లో ఆయన ప్రయాణిస్తున్న కారు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తాను స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డానని క్లార్క్ స్వయంగా వెల్లడించాడు. మే 31న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించిన క్లార్క్, అనంతరం విమానాశ్రయానికి బయలుదేరాడు. మార్గమధ్యలో తాను నిద్రలోకి జారుకున్నానని, మెలకువ వచ్చేసరికి తన కారు ముందు భాగం ఒక సెమీ ట్రక్కు కింద ఇరుక్కుపోయి ఉందని ఆయన తెలిపాడు. బ్రేక్ లైట్లు పనిచేయని ట్రక్కును తమ కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించిందని క్లార్క్ వివరించాడు. 'బియాండ్ 23 క్రికెట్ పాడ్‌కాస్ట్'లో ఈ వివరాలను పంచుకున్నాడు. "ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. నిద్రలో నుంచి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచేసరికి, కారు ముందు భాగం ట్రక్కు కింద ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను" అని క్లార్క్ పేర్కొన్నాడు. ఈ ఘటనలో తనకు స్వల్ప గాయాలయ్యాయని, అయితే డ్రైవర్ కాలు విరిగి ఉండవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఆ కారు ఒక సంస్థకు చెందినది కావడంతో, డ్రైవర్ తీవ్ర భయాందోళనకు లోనయ్యాడని క్లార్క్ తెలిపాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయం అందించారని క్లార్క్ వెల్లడించాడు. "భారత్‌లో ఉన్న ఉదార స్వభావం గల ప్రజల వల్లే నేను సురక్షితంగా ఇంటికి చేరుకోగలిగాను" అని పేర్కొన్నాడు. తన యోగక్షేమాల గురించి ఆరా తీసిన బీసీసీఐ అధికారులకు కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్ ఆద్యంతం వ్యాఖ్యాతగా వ్యవహరించిన క్లార్క్, ఫైనల్ ముగిసిన కొద్ది గంటలకే ఈ ప్రమాదానికి గురయ్యాడు.

## శ్రీలంక చేరుకున్న తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇతర ఆటగాళ్లు...

శ్రీలంకలో జరగనున్న 50 ఓవర్ల ముక్కోణపు సిరీస్ కోసం తిలక్ వర్మ సారథ్యంలోని భారత 'ఏ' జట్టు లంక గడ్డపై అడుగుపెట్టింది. జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ సిరీస్‌లో భారత్‌తో పాటు ఆతిథ్య శ్రీలంక 'ఏ', ఆఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో ప్రధానంగా భారత చిచ్చరపిడుగు, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ లో వైభవ్ పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. భారత జట్టు శ్రీలంక చేరుకున్న విషయాన్ని ఆ దేశ క్రికెట్ బోర్డు (ఎస్ఎల్ సీ) సోషల్ మీడియా ద్వారా ధృవీకరించింది. తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్న ఫోటోలను పంచుకుంది. "భారత 'ఏ' జట్టు శ్రీలంకకు చేరుకుంది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నమెంట్‌లో వారు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక ఆట మొదలవుతుంది" అని ఎస్ఎల్ సీ పేర్కొంది. ఈ పర్యటనకు ముందు భారత జట్టులో రెండు కీలక మార్పులు జరిగాయి. తొడ కండరాల గాయంతో రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరమవడంతో, అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026 చివరి దశలో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్నప్పుడు పరాగ్ ఈ గాయానికి గురయ్యాడు. ప్రస్తుతం అతను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకోనున్నాడు. మరోవైపు, హర్ష్ దూబేకు సీనియర్ జట్టు నుంచి పిలుపు రావడంతో, అతని స్థానంలో అనుకుల్ రాయ్‌ను జట్టులోకి తీసుకున్నారు.

భారత 'ఏ' జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుద్ధ్వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 'పెద్ది'లో జాన్వీ పాత్రపై వివాదం.. ఇది ఖరీదైన అవమానం అంటూ సింగర్ పోస్ట్



రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో జూన్ 4న విడుదలైన 'పెద్ది' చిత్రం వివాదాలకు కేంద్రబిందువైంది. ఈ చిత్రంలో హీరో పాత్రకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నప్పటికీ, హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రను కేవలం గ్లామర్‌కే పరిమితం చేస్తూ అసభ్యంగా చిత్రీకరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ గాయని సుమంగళి అరియనాయగం ఈ అంశంపై చిత్ర బృందాన్ని తప్పుబడుతూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్, ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది."భారతీయ సినిమాలో ఒక ప్రముఖ కథానాయికకు జరిగిన అత్యంత ఖరీదైన అవమానం" అనే శీర్షికతో 'రిఫరెన్స్ కమ్యూనిటీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ చేసిన పోస్ట్ ఈ వివాదానికి మూలమైంది. కథలో హీరో పాత్రకు బలమైన సామాజిక నేపథ్యం ఉన్నప్పటికీ, హీరోయిన్ పాత్రను మాత్రం కేవలం రొమాంటిక్ సన్నివేశాలకు, గ్లామర్ ప్రదర్శనకు పరిమితం చేశారని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.విశేషమేమిటంటే, ఈ పోస్ట్‌ను జాన్వీ కపూర్ స్వయంగా లైక్ చేయడంతో, తన పాత్ర చిత్రణ పట్ల ఆమె కూడా అసంతృప్తిగా ఉన్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.ఈ పోస్ట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న గాయని సుమంగళి, "అధికారం లేకపోవడం వల్ల కలిగే వేదన గురించి కథను సిద్ధం చేయడానికి శక్తివంతమైన పురుషులందరూ ఒకచోట చేరారు. కానీ, అదే సమయంలో జాన్వీ కపూర్ పాత్రను కెమెరా ముందు కేవలం ఒక శరీరంగా, బలవంతపు ముద్దులకు వస్తువుగా, పాటల వరకే పరిమితమైన ఒక సాధనంగా మార్చేశారు" అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుమంగళి వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, భారీ బడ్జెట్ చిత్రాలలో మహిళా పాత్రల చిత్రణపై విస్తృత చర్చ మొదలైంది. ఒకవైపు 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనమైన వసూళ్లు సాధిస్తున్నప్పటికీ, హీరోయిన్ పాత్రను తీర్చిదిద్దడంలో దర్శకుడు విఫలమయ్యారని పలువురు సినీ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విమర్శలపై చిత్ర బృందం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## రామానాయుడు స్టూడియోలో నా ఫొటో ఉండాలనే కోరిక నెరవేరింది: ప్రియమణి

నేషనల్ అవార్డ్ విన్నర్, సీనియర్ నటి ప్రియమణి టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వచ్చిన 'నారప్ప' చిత్రంలో ఆమె పోషించిన సుందరమ్మ పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై పెద్ద సక్సెస్ సాధించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ... ఈ సినిమాకు సంబంధించి, అలాగే తన కెరీర్‌కు సంబంధించిన ఒక కీలక విషయాన్ని పంచుకుంది. "చాలా ఏళ్ల క్రితం నేను రామానాయుడు స్టూడియోలో షూటింగ్ చేస్తున్న సమయంలో, అక్కడ ఒక గోడపై ఎంతోమంది ప్రముఖ నటీమణుల ఫొటోలు అందంగా అలంకరించి ఉండటం చూశాను. అప్పట్లో వాటి ప్రాధాన్యత నాకు పూర్తిగా తెలియదు. కానీ ఆ తర్వాత తెలిసింది.. వారంతా ప్రతిష్ఠాత్మక 'సురేష్ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో నటించిన లెజెండరీ హీరోయిన్లు అని. ఆ రోజే నా మనసులో ఒక బలమైన కోరిక కలిగింది.. ఎలాగైనా భవిష్యత్తులో ఆ గోడపై నా ఫొటో కూడా స్థానం సంపాదించుకోవాలని అనుకున్నాను" అని చెప్పుకొచ్చింది.ఆమె అనుకున్నట్లుగానే కొన్ని సంవత్సరాల తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ నుండి 'నారప్ప' రూపంలో ఆమెకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన నటించడమే కాకుండా, సురేష్ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్‌లో పనిచేయాలనే దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసింది. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక గొప్ప విజన్ ఉన్న దర్శకుడని, నారప్ప చిత్రాన్ని ఎంతో అద్భుతంగా, భావోద్వేగభరితంగా తెరకెక్కించారని కొనియాడింది. 'నారప్ప' సినిమాలో నటించడం వల్లే ఈ రోజు రామానాయుడు స్టూడియోలో ఆ హీరోయిన్ల ఫొటోల పక్కన తన ఫొటో కూడా చేరిందని, ఆ కోరిక నెరవేరడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని ప్రియమణి భావోద్వేగానికి లోనైంది.





## ట్రోల్స్ పట్టించుకోను: నిధి అగర్వాల్

### వరుసగా పరాజయం పాలవుతున్న నిధి నటించిన సినిమాలు

### ఐరన్ లెగ్ అంటూ ట్రోల్ చేస్తున్న నెటిజన్లు

### తాను టాలెంట్ ను మాత్రమే నమ్ముకుంటానన్న నిధి

టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ కి ఈ మధ్య కాలంలో అదృష్టం పెద్దగా కలిసిరావడం లేదు. 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' లాంటి పెద్ద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోవడంతో... సోషల్ మీడియాలో నిధిపై కొందరు నెటిజన్లు తీవ్రంగా నెగెటివ్ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. కేవలం టాలెంట్ ఉంటే సరిపోదని, ఇండస్ట్రీలో రాణించడానికి అదృష్టం కూడా ఉండాలంటూ విమర్శిస్తూ.. ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం స్టార్ట్ చేశారు.ఈ ట్రోల్స్‌పై నిధి అగర్వాల్ స్పందిస్తూ... తాను విమర్శలను పట్టించుకోనని చెప్పింది. పొగడ్తలను కూడా తలకెక్కించుకోనని స్పష్టం చేసింది. విజయవంతమైన నటిగా పేరు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుందని... తాను కూడా దానికి మినహాయింపు కాదని తెలిపింది. సినిమా సక్సెస్ అనేది కేవలం ఒకరిద్దరి మీద కాకుండా చాలా విషయాలపై ఆధారపడి ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. తను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయినప్పుడు చాలా సంతోషించానని, ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపింది. తాను 'లక్' కంటే కేవలం తన 'టాలెంట్'ను మాత్రమే నమ్ముకుంటానని తేల్చి చెప్పింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com